సమస్యల బడి

• కనీస వసతుల్లేక విద్యార్థుల అవస్థలు
• పట్టించుకోని అధికారులు


బెంచీలు లేని తరగతి గది

వరికుంటపాడు: వరికుంటపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో కనీస వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలలో 286 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మండల పరిధిలోని వేంపాడు తిమ్మారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి, డక్కునూరు, పామూరు మండలం పోతవరం గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఇక్కడి హైస్కూల్‌కు వచ్చి చదువుకుంటున్నారు.

సమస్యల తిష్ట

పాఠశాల ముందు భాగంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. ఈ సమస్య చాలారోజులుగా ఉన్నా వాటిని తొలగించే నాథుడే కరువయ్యారు. ఈ హైస్కూల్లో ఇద్దరు మహిళా స్వీపర్లు ఉన్నా పారిశుద్ధ్యం మాత్రం అధ్వానంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలతో పాముల బెడద తీవ్రంగా ఉంది. రూ.35 లక్షల నాడు–నేడు నిధులతో అభివృద్ధి పనులు చేయించినా నిర్వహణ మాత్రం గాలికి వదిలేశారు. ఫలితంగా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయి మరుగుదొడ్లు కనిపించని పరిస్థితి నెలకొంది. దీనివల్ల విద్యార్థులు అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఈ హైస్కూల్లో పారిశుద్ధ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఇద్దరు స్వీపర్లను నియమించింది. అయినప్పటికీ పాఠశాల పరిసరాల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. అలాగే 256 మందికి మధ్యాహ్న భోజనాన్ని ఆరుబయటే వంటలు వండుతున్నారు. భోజన నాణ్యత కూడా సక్రమంగా లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కూల్‌కు గతంలో పీఈటీ ఉన్నప్పుడు విద్యార్థులతో బాగా ఆటలు ఆడించేవారు. ప్రస్తుతం ఆయన బదిలీపై వెళ్లడంతో ఎలాంటి ఆటలు లేవని విద్యార్థులు వాపోతున్నారు. అలాగే స్కూల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో కొన్ని సెక్షన్లకు బెంచీలు ఉండడం లేదు. పాఠశాలలో ఏడో తరగతి ఏ–సెక్షన్‌లో బెంచీలు లేవని, ఆరో తరగతి బీ–సెక్షన్‌లో 38 మంది కిందనే కూర్చొని చదువుకుంటున్నామని పిల్లలు వాపోతున్నారు.


పాఠశాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు

అన్నం సరిగ్గా ఉడకడం లేదు



మా స్కూల్లో మధ్యాహ్న భోజనం అప్పుడప్పుడు సరిగ్గా ఉడకటం లేదు. పీఈటీ సార్ లేనందువల్ల ఆటలు కూడా ఏమీ లేవు. బాత్‌రూములు క్లీన్‌గా ఉండటం లేదు. బాత్రూమ్‌లో కప్పలు, పురుగులు తిరుగుతున్నాయి. స్కూల్లో కొన్ని బెంచీలు విరిగిపోయాయి.

– నాగసాత్విక్, పదో తరగతి విద్యార్థి

పిచ్చిమొక్కలను తొలగిస్తాం

పాఠశాల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తాం. బాత్‌రూములు కూడా శుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తాం.

– పరుచూరి మాలకొండయ్య, హెడ్‌మాస్టర్

క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



సీతారామపురం: మండలంలోని పబ్బులేటిపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో 66 మంది విద్యార్థులకు అదే పాఠశాల ఉపాధ్యాయుడు అన్నంగి ప్రసాద్ తన సొంత నిధులు రూ.11 వేలు వెచ్చించి నోటు పుస్తకాలు, ఐడీ కార్డులతో పాటు విద్యాసామగ్రిని మంగళవారం అందించారు. దీనిని ఎంఈఓ మస్తాన్‌వలీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ప్రసాద్ అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, పాఠశాల చైర్మన్ మద్దినేని రత్తయ్య, ఎంఈఓ–2 ప్రవీణ, పాఠశాల హెచ్ఎం ఎండీ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు మహేష్, సువర్ణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలీ

సీతారామపురం: పరిశుభ్రతపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ మస్తాన్‌వలీ అన్నారు. ఆయన మండలంలోని బసినేనిపల్లి ప్రాథమిక పాఠశాలతో పాటు జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. 3, 4 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యంతో పాటు, రాగిజావ నాణ్యతను పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పాఠ్యాంశాలపై ప్రత్యేకంగా తర్ఫీదు ఇవ్వడం అభినందనీయమన్నారు.

కొల్లపనాయుడుపల్లికి తరలిన వైద్య సిబ్బంది


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలంలోని కొల్లపనాయుడుపల్లిలో ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్న వైనంపై సాక్షి దినపత్రికలో మంగళవారం వెలువడిన వార్తకు వైద్యశాఖ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే చిత్తలూరు పీహెచ్‌సీ పరిధిలోని కొల్లపనాయుడుపల్లి, చిత్తలూరులో ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి విచారిస్తున్నారని డాక్టర్లు నవీన్‌కుమార్, నరసింహారావు తెలిపారు. గ్రామంలో జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు ఉన్న రోగులు కనిపిస్తున్నారని, జ్వరాలు తక్కువ సంఖ్యలో ఉన్నాయని, వీటి వల్ల బాధపడుతున్న ప్రజలు మా సిబ్బందికి సమాచారం అందిస్తే వెంటనే వారి ఇళ్ల వద్ద అవసరమైన పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందిస్తామని తెలియజేశారు.

తరుణవాయిలో దంత వైద్యశిబిరం



సంగం: మండలంలోని తరుణవాయి ప్రాథమిక పాఠశాలలో నారాయణ వైద్యశాల వారిచే మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ప్రజలకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

కాలువల మరమ్మతులకు వినతి



కావలి(అల్లూరు): కావలి పట్టణ పరిధిలోని 20వ వార్డు శాంతినగర్ కాలనీలో డ్రెయినేజీ కాలువలు అస్తవ్యస్తంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేయాలని కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు సీపీఎం నాయకులు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. స్థానికంగా డ్రెయినేజీ కాలువలు సక్రమంగా లేనందున మురుగునీరు కిందకు పారడం లేదన్నారు. దీనివల్ల తీవ్ర దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పి.పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో తగ్గని వర్గపోరు

• పోలీసుల అదుపులో బొల్లినేని అనుచరుడు

ఉదయగిరి: నియోజకవర్గ టీడీపీలో వర్గపోరు కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, ప్రస్తుత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వర్గీయుల మధ్య నడుస్తున్న పోరు వల్ల ఆ పార్టీలో కుంపటి రగులుతోంది. తాజాగా సోమవారం ఉదయగిరిలో ఓ వివాహ వేడుకకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరయ్యారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త, మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు మహబాబ్ బాషా (లాడెన్) కాకర్ల ఎదురుగా బొల్లినేనికి అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే కాకర్ల అసహనం చెందడంతో పోలీసుల ద్వారా అతడిని నియంత్రించారు. అనంతరం అతనిపై పంచాయతీ వేలంపాటలకు సంబంధించిన విషయమై గొడవపడి, తిట్టినట్టుగా పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తితో ఫిర్యాదు చేయించారు. ఈ క్రమంలో పోలీసులు మంగళవారం ఉదయం మహబాబ్‌బాషాతో పాటు అతడు కుమారుడు రఫీని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఈ క్రమంలో బాధితుడి కుటుంబ సభ్యులతో పాటు మరికొంత మంది ముస్లిం మహిళలు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని అరెస్ట్‌పై ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు కేసులు ఎలా పెడతారంటూ పోలీసులను నిలదీశారు. బాధితులు మాట్లాడుతూ తాము టీడీపీకి చెందిన వారే అయినా కొంత మంది చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు నిలదీస్తున్నందుకు మాపై కక్ష కట్టారని ఆరోపించారు. ఈ విషయాన్ని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వింజమూరు విద్యార్థులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుచ్చిరెడ్డిపాళెంలో సోమవారం జరిగిన పోటీల్లో నెట్‌బాల్, ఫెన్సింగ్ క్రీడల్లో షేక్.మౌలానా పర్వేజ్, ఎస్.అక్షిత్, సీహెచ్ శ్రీనివాసులు, ఎం.లోకేష్, తాహీర్, కె.బద్రినారాయణ, జశ్వంత్‌కుమార్, తాజుద్దీన్, టి.సతీష్‌కుమార్, డి.ఉషారాణి, వి.ఐశ్వర్య, ఎ.చరిత, బి.కృతికలు రాణించారు. ఈ క్రమంలో వారిని పీడీ ప్రభాకర్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయ బృందం అంజయ్య, సుమలత, హెచ్ఎం మాలకొండయ్య మంగళవారం అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

వృద్ధురాలిపై దాడి

ఆత్మకూరు: దారి వివాదంలో ఓ వ్యక్తి వృద్ధురాలిపై దాడి చేసిన ఘటన మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయిప్రసాద్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొత్రపాటి వెంకట సుబ్బయ్య ఇంటి వెనుకనే గంగవరపు శ్రీదేవమ్మ నివాసం ఉంటోంది. వీరిళ్లకు ఉమ్మడి దారి ఉంది. అయితే శ్రీదేవమ్మ ఆ దారిని ఉపయోగించరాదని వెంకట సుబ్బయ్య పలుమార్లు గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆమె బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి తన ఇంటి రేకులను కర్రతో కొడుతూ వెంకట సుబ్బయ్య నానా యాగి చేస్తుండడంతో ప్రశ్నించినందుకు శ్రీదేవమ్మపై దాడి చేశాడు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గుండెమడకల చెరువు పరిశీలన

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని గుండెమడకల చెరువును సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ రమణారెడ్డితో పాటు పలువురు ఇరిగేషన్ అధికారులు, ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవులునాయుడుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సోమశిల హైలెవెల్ కెనాల్ ఫేజ్–2లో భాగంగా గుండెమడకల చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు కాగా వాటితో 50 శాతం పనులు పూర్తి చేశామన్నారు. చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ ఈఈ రాజశేఖర్, డీఈ విజయరామిరెడ్డి, వైస్ చైర్మన్ పి.మధుసూదన్‌రెడ్డి, ఏఈ మల్లికార్జున, మాజీ ఎఫ్‌సీఐ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అక్టోబర్ 2 వరకు మెడికల్ క్యాంప్‌లు

సంగం: స్వస్థ్ నారి– సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమం గురించి వారికి అవగాహన కల్పించారు. 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యాంపులో 12 కౌంటర్లు ఏర్పాటు చేసి మహిళలు, చిన్నారులు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వింజమూరు(ఉదయగిరి): మండలంలోని బొమ్మరాజుచెరువు గ్రామంలో ధరణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను దాత ఎల్లాల రఘురామిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన జీసన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ వారు ఈ ప్లాంటు నిర్మాణానికి కొంత ఆర్థిక సాయం అందించారన్నారు. భవిష్యత్తులో మరి కొన్ని ప్లాంట్లు నిర్మిస్తామని చెప్పారు. అనంతరం గ్రామస్తులు దాతను సన్మానించారు. సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నేత గోపి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల సందర్శన



మర్రిపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఉదయగిరి సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె.రమణారెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు భోజన వసతిపై రికార్డులను పరిశీలించారు. బాలుర వసతి గృహం శిథిలావస్థలో ఉన్నందున విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అద్దె భవనంలోకి మార్చాలని ఉన్నతాధికారులకు తెలియజేయనున్నామని తెలిపారు. త్వరలో వసతిగృహాన్ని అద్దె భవనంలోకి మారేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

ముగిసిన ఓరియంటేషన్ తరగతులు

ఉదయగిరి : స్థానిక ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు రూరల్ అవేర్‌నెస్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్‌పై జరుగుతున్న ఓరియంటేషన్ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి, కడప కేవీకే ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కె.అంకయ్యకుమార్, కడప డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ ఎస్.విష్ణుప్రియ పాల్గొని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల విస్తరణాధికారి టి.గోపికృష్ణ, వివిధ శాఖల విభాగాధిపతులు కిషన్ తేజ్, రఘునాథరెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 650 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 650 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ మంగళవారం తెలిపారు. వేలానికి 1,028 బేళ్లు రాగా వాటిలో 650 బేళ్లను విక్రయించామని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలియజేశారు. గరిష్ట ధర కిలో రూ.330 కాగా కనిష్టంగా రూ.100 లభించింది. సగటు ధర రూ.214.36గా నమోదైంది. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.331

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.331 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 732 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 640 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 92 బేళ్లను తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ కిలో పొగాకు కనిష్ట ధర రూ.100 పలకగా, సరాసరి రూ.205.82 లభించిందన్నారు. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

సీతారామపురం ఎంపీడీఓ బదిలీ

సీతారామపురం: మండల ఎంపీడీఓ సాయిప్రసాద్ తిరుపతి జిల్లా వాకాడుకు బదిలీ అయ్యారు. మర్రిపాడు డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న సాయిప్రసాద్ గత నెలలో ఎఫ్ఏసీపై ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ ఎంపీడీఓలకు పదోన్నతి కల్పించిన నేపథ్యంలో సాయిప్రసాద్ ఎంపీడీఓగా వాకాడుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి సోమవారం ఉత్తర్వులు వచ్చినట్లు అధికారిక సమాచారం.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగం: 2025–26 విద్యా సంవత్సరానికి సంగం ఐటీఐలో నాలుగో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.మురళీధర్ మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని, 27వ తేదీ వరకు వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు. ఫిట్టర్ సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 29వ తేదీ ఉదయం 10 గంటలకు ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ క్యాంపస్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 99639 50604, 76718 61779 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మండల సమావేశం నేడు

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మూలే పద్మజ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

‘డీబీఎస్’లో క్యాంపస్ ఇంటర్వ్యూలు



కావలి(అల్లూరు): స్థానిక డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలను మంగళవారం నిర్వహించారు. ఈసీఈ విభాగానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు టాటా టెలీ కమ్యూనికేషన్ సంస్థ వారు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికైనట్లు కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలియజేశారు.

అక్రమ లేఅవుట్లకు నోటీసులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో ఉన్న 22 అనధికార లేఅవుట్లకు నుడా జేపీఓ సుష్మాంజలి మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ రామారావు, నుడా ప్లానింగ్ పంచాయతీ సెక్రటరీ శ్రీధర్‌చౌదరి ఉన్నారు.

విద్యుత్ కనెక్షన్ల తొలగింపుపై ఆందోళన

కావలి (అల్లూరు): పట్టణంలోని 17వ వార్డు బుడంగుంట ఇందిరమ్మ ఎస్సీ కాలనీలో విద్యుత్ కనెక్షన్లను తొలగించడంతో కావలి–జలదంకి రహదారిపై స్థానికులు మంగళవారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 50 మందికిపైగా విద్యుత్ సిబ్బంది ఒక్కసారిగా కాలనీలోకి వచ్చి చాలా మంది ఇళ్ల విద్యుత్ కనెక్షన్లను తొలగించారన్నారు. సర్వీసు వైర్లు, మీటర్లను తీసుకెళ్లారన్నారు. ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే విద్యుత్ కనెక్షన్లు తొలగించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

జలదంకి (కలిగిరి): జలదంకిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరమణయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. సమస్యలపై చర్చించకుండానే మొక్కుబడిగా సమావేశం జరిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌బాబు శాఖల వారీగా జరుగుతున్న పనులపై సమీక్ష జరిపారు. పలువురు సభ్యులు యూరియా కొరతపై వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. రైతులకు సక్రమంగా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తిమ్మసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో 2021 నుంచి పనిచేస్తున్న స్వీపర్‌ను తొలగించడంపై సర్పంచ్ ప్రసాద్‌నాయుడు ఎంఈఓను ప్రశ్నించారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో మందుబాబులు అపరిశుభ్రం చేస్తున్నారని ప్రశ్నించినందుకు స్వీపర్‌ను తొలగించడం సమంజసం కాదన్నారు. చిరు ఉద్యోగులపై రాజకీయాలు చేయడం తగదని, ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేకల ధనమ్మ, పీఏసీఎస్ చైర్మన్ అప్పలనాయుడు, సోమశిల ప్రాజెక్ట్ డైరెక్టర్ మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమీకరణపై గ్రామసభ

దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల జాతీయ రహదారి వెంబడి ఏపీఐఐసీ కోసం భూ సమీకరణకు స్థానిక సచివాలయంలో తహసీల్దార్ కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని సర్వే నంబర్–47లో ఉన్న సుమారు 22.04 ఎకరాలను ప్రస్తుతం సేకరిస్తున్నామని, ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం అందిస్తామని తహసీల్దార్ రైతులకు సూచించారు. దీనిపై రైతులు మాట్లాడుతూ 2016లో విమానాశ్రయ భూములకు ఇచ్చినట్లుగా ప్రస్తుతం కూడా నష్ట పరిహారం చెల్లిస్తామంటే కుదరదని తేల్చి చెప్పారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం మూడింతల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్వో బాలనాగమ్మ, రైతులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఆనం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలను డీఈఓ బాలాజీరావుతో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం సందర్శించారు. ఇటీవల గురుకుల పాఠశాలలో బాలికలు జ్వరాలబారిన పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పాఠశాలను సందర్శించి పారిశుద్ధ్య పనులపై ఆరాతీశారు. భోజనశాలలో ఈగల బాధను నిర్మూలించేలా మూడు యంత్రాలను దాత సాయంతో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల జ్వరాలు బారిన పడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించామని, ప్రస్తుతం వారు కోలుకొని తరగతులకు హాజరవుతున్నారన్నారు. ఆర్డీఓ పావని, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం, తహసీల్దార్ పద్మజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పూజలు



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో పోలేరమ్మ తల్లికి మంగళవారం చిన్నారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదకాపు మెట్టుకూరు పద్మారెడ్డి విశేష పూజలు చేసి చిన్నారులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యాసామగ్రి పంపిణీ



కావలి(అల్లూరు): పట్టణంలోని డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో కామాటివారి వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాసామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి వాటిని అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

కొండాపురం: ఉపాధి హామీ పథకానికి సంబంధించి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ ఆదినారాయణ అన్నారు. మండలంలోని ఉప్పలూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పకుండా హాజరు వేసి ప్రతిఒక్కరికీ సగటు కూలి పడే విధంగా పనులు చేయించాలన్నారు. అనంతరం ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని ఉపాధి కూలీలకు సూచించారు.

సమయపాలన తప్పనిసరి

సీతారామపురం: సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ సాయిప్రసాద్ అన్నారు. ఆయన సీతారామపురం బిట్–1 సచివాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. పలువురు సిబ్బంది సచివాలయంలో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కారు బోల్తా

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి టోల్‌గేట్ సమీపంలో నెల్లూరు– ముంబై జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఓ కారు బోల్తా పడింది. నెల్లూరు నుంచి బద్వేల్‌కు వెళ్తున్న కారు డీసీపల్లి వద్దకు వచ్చేసరికి డివైడర్‌ను ఢీకొనడంతో కారు బోల్తా పడి ఓ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది అతనికి ప్రాథమిక చికిత్సను అందించారు.

వెన్నవాడ సొసైటీ మాజీ అధ్యక్షుడు మృతి


పర్వతరెడ్డి బలరామిరెడ్డి (ఫైల్)

ఆత్మకూరు రూరల్: మండలంలోని వెన్నవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పర్వతరెడ్డి బలరామిరెడ్డి (73) మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా బలరామిరెడ్డి కుమారుడు మధుసూదన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించి, ధైర్యంగా ఉండాలని చెప్పారు. అదేవిధంగా ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లారెడ్డి అనసూయమ్మ, పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి తదితరులు తమ సంతాపం తెలిపారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఉదయగిరి: స్థానిక ప్రజా రవాణా సంస్థ డిపో ఆవరణలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక జెండాను ఎగురవేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కార్మికుల ఐక్యత ముఖ్యమన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ తన వంతు కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కాకు వెంకటయ్య, యస్థానీ, వెంకటేశ్వర్లు, రవి, నాగేశ్వరరావు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలు పెంచాలి

సోమశిల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాలను పెంచాల్సిన అవసరం ఉందని సమగ్రశిక్ష జిల్లా మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు అన్నారు. ఆయన చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి మోడల్ ప్రైమరీ, కొల్లపనాయుడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు.

• **అనుమసముద్రంపేట:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఏఎస్‌పేట ఎంఈఓ జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆటల పోటీలను ఆమె మంగళవారం ప్రారంభించారు. గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ వాసు, పీడీ థామస్ పాల్గొన్నారు.

• **ఉదయగిరి రూరల్:** ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని ఎంఈఓ–1 వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి గ్రామాల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించారు. హెచ్ఎంలు సుబ్బారెడ్డి, నరసింహులు ఉన్నారు.